

## కళాకారుల సమస్యలను పరిష్కరిస్తాం..

రవీంద్రభారతి, మార్చి 12 : సాంస్కృతిక సారథి కళాకారుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ప్రసంగించారు.

## ఫ్రీ హలీం.. లాఠీచార్జి



మలక్‌పేట, మార్చి 12 : మలక్‌పేట మూసారాంబాగ్ చౌరస్తాలోని అజీబో రెస్టారెంట్‌లో ఫ్రీ హలీం పంపిణీ ఉద్రిక్త వాతావరణానికి దారితీసింది. రంజాన్ మాసం మొదటి రోజును పురస్కరించుకొని ఫ్రీగా హలీం పంపిణీ చేయనున్నట్లు రెస్టారెంట్ నిర్వాహకులు బోర్డు పెట్టడంతోపాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టడంతో మంగళవారం సాయంత్రం రెస్టారెంట్ వద్దకు వేలాదిగా చేరుకున్నారు. ఏడు గంటలకు హలీం పంపిణీ ప్రారంభించగా.. ఒక్కసారిగా జనం ఎగబడటంతో తొక్కిసలాట చోటు చేసుకున్నది. దీంతో రెస్టారెంట్ నిర్వాహకులు వారిని అదుపు చేయలేక చేతులెత్తేశారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించి పోవడంతో రంగంలోకి దిగిన మలక్‌పేట పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. రెస్టారెంట్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

## మీర్‌పేట బీఆర్‌ఎస్‌దే

వీగిపోయిన బీజేపీ, కాంగ్రెస్ అవిశ్వాసం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని కలిసిన మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

బడంగ్‌పేట, మార్చి 12 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్‌పై బీజేపీ, కాంగ్రెస్ పార్టీ పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. మరోసారి మేయర్ పీఠం బీఆర్‌ఎస్ కైవసం చేసుకున్నది. ఈ సందర్భంగా మేయర్ దుర్గా, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అవిశ్వాసం వీగిపోవడానికి పూర్తి స్థాయిలో సహకరించిన ఎమ్మెల్యేకు, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్పొరేటర్లు సిద్దాల పద్మ అంజయ్య, ఏనుగుల అనిల్ కుమార్, ధనలక్ష్మి రాజ్‌కుమార్, బొక్క రాజేందర్ రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, రేఖాలక్ష్మణ్, మీర్‌పేట పార్టీ అధ్యక్షులు అర్కల కామేశ్ రెడ్డి, జటావత్ శ్రీనునాయక్, ప్రభాకర్ రెడ్డి, గోపీయాదవ్, తదితరులు ఉన్నారు.

## ఫ్రీ కోచింగ్

జూబ్లీహిల్స్, మార్చి 12 : విదేశాల్లో విద్యను అభ్యసించడానికి ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ అప్‌గ్రేడేషన్ స్కీంలో భాగంగా విదేశీ విద్య అర్హత పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు స్టెప్‌ఇన్ లీడ్స్ అకాడమీ డైరెక్టర్ వంగూరి బ్రహ్మయ్య తెలిపారు. మార్చి 14న సూరారంలోని బాబూ జగ్జీవన్‌రామ్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 90304 63377, 98492 33523 సంప్రదించాలని కోరారు.

# ముఖ్యమంత్రి గారు.. మాకు ఉరి వేయండి.!



మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న సాయిప్రియనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు

### ఎన్నికల ముందు అండగా ఉంటామని హామీ

- అధికారంలోకి రాగానే దుశ్చర్య
- 20 ఏండ్ల కింద కొన్నాం.. ఇండ్లు కట్టుకున్నాం
- ఇంటి నంబర్లు, కరెంటు మీటర్లు ఉన్నా.. పన్ను కడుతున్నా.. ఎందుకీ దౌర్జన్యం
- సాయిప్రియనగర్ కాలనీలో ఏకకాలంలో 175 ఇండ్లు కూల్చివేత
- కట్టు బట్టలతో రోడ్డున పడ్డ వందల కుటుంబాలు
- ఇందిరమ్మ ఇళ్లు కట్టించి నీడ కల్పించండి
- సాయిప్రియనగర్ కాలనీ బాధితులు

ఖైరతాబాద్, మార్చి 12 : అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాలేదు. అప్పుడే పేద, మధ్యతరగతి ప్రజలను కట్టుబట్టలతో రోడ్డున పడేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 175 ఇండ్లను కూల్చివేశారు. దీంతో ఆ కుటుంబాలన్నీ పిల్లా పాపలతో రోడ్డున పడ్డాయి. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మేడిపల్లి మండలం, పర్వతాపూర్‌లోని సాయిప్రియనగర్ కాలనీలో జరిగింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాయిప్రియనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారులు నారగోని ప్రవీణ్ కుమార్, అధ్యక్షుడు సీహెచ్ మహేందర్, బాధితులు లక్ష్మి, ఉజ్వలత తమ గోడును వెల్లబోసుకున్నారు. సాయిప్రియనగర్‌కాలనీలోని సర్వే నంబరు 10, 11లో సుమారు 16 ఎకరాల్లో 1994 నుంచి 2002 సంవత్సరాల మధ్య పైసా పైసా కూడబెట్టుకొని నెలకు రూ.500 చొప్పున వాయిదాలు చెల్లించి ఒక్కొక్కరు 133 నుంచి 200 గజాల లోపు స్థలాన్ని కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన వారిలో సుమారు 350 మంది పేద, మధ్యతరగతి ప్రజలు కూలీలే ఉన్నారన్నారు. అందులో కాలక్రమేనా ఇండ్లు నిర్మించుకున్నామన్నారు. ప్రస్తుతం ఆ ఇండ్లకు జియో ట్యాగ్ చేయడంతో పాటు ఇంటి నంబర్లు సైతం కేటాయించారని, కరెంటు బిల్లులు, ఇతర పన్నులు కడుతున్నామన్నారు.

### జీవో నం.118తో భరోసా కల్పించిన కేటీఆర్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో స్వయంగా మంత్రి కేటీఆర్ జీవో నం.118 తీసుకువచ్చి, తద్వారా నామమాత్రంగా రుసుము చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించారన్నారు. అంతలోనే ఎన్నికలు వచ్చాయని, ఆ సమయానికి కేవలం ఒక్క ఇళ్లు మాత్రమే క్రమబద్ధీకరణ జరిగిందన్నారు. ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన తర్వాత ఇండ్ల రెగ్యూలరైజేషన్ కోసం ప్రజావాణి, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నామని, స్వయంగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించామని, అయినా తమపై కనికరం చూపలేదన్నారు.


### మాపై వజ్రేశ్ యాదవ్ కక్ష గట్టారు

ఇదిలా ఉండగా, మేడ్చల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేతిలో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్ తమపై కక్ష గట్టారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం స్థానిక నాయకులకే ఫుల్‌పవర్ ఇవ్వడంతో ప్రభుత్వ భూమి పేరిట తమ ఇండ్లను బలవంతంగా కూల్చివేయించారని వాపోయారు. కూల్చివేసే ముందు కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే స్వయంగా ఇండ్లను క్రమబద్ధీకరిస్తానని చెప్పిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీటుపై కూర్చోగానే తమను విస్మరించారని, పైగా కాంగ్రెస్ నాయకులే దుశ్చర్యకు పాల్పడుతుంటే చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి గారు.. కట్టుబట్టలతో రోడ్డున పడ్డ తమకు నీడనైనా కల్పించండి.. లేని పక్షంలో స్వయంగా ఉరివేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# థాణాల్లో ట్రెండ్ మారింది

## సెటిల్‌మెంట్‌లకు అడ్డాలు.. పోలీస్ స్టేషన్లు

- నిందితులకు రాచ మర్యాదలు..
- ఫిర్యాదుదారులే నిందితులుగా ట్రీట్
- నగర పోలీసులపై వెల్లువెత్తుతున్న విమర్శలు



ఠాణాలో కూర్చొని ఉన్న నిందితులు



ఠాణాలో నిల్చొని ఉన్న బాధితులు

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ): సిటీ ఠాణాల్లో ఫ్రెండ్లీ పోలీసింగ్ కన్పించకపోవడమే కాకుండా.. వచ్చిన బాధితులకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదనే విమర్శలు వస్తున్నాయి.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులను ఆప్యాయంగా పలుకరిస్తూ.. మీ కోసం మేమున్నామంటూ వారిలో ధైర్యం నింపాల్సిన పోలీసులు ఆ విషయాన్ని మర్చిపోయారు. ఇప్పుడు ఠాణాలలో అంతా ట్రెండ్ మారింది. స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చే వారిని నిలబెట్టి మాట్లాడడం.. అదే ఆరోపణలు ఎదుర్కొనే(నిందితులను) కూర్చొబెట్టి మాట్లాడడం.. దళారీ కేసు నమోదు చేయడమంటేనే ఎఫ్ఐఆర్ నమోదు చేసే పరిస్థితి నెలకొంది. నగర పోలీస్ కమిషనర్ తన బాధ్యతలు తీసుకున్నప్పుడే ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే బాధితులతో ఫ్రెండ్లీగా.. తప్పు చేసిన వారితో కఠినంగా ఉంటామంటూ చెప్పారు. అయితే అందుకు విరుద్ధంగా కొన్ని పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది నడుచుకుంటున్నారు. సౌత్‌జోన్ పరిధిలో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉంటున్నాయి. ఫిర్యాదు చేయాలంటే ఏదో నాయకుడి వద్దో.. స్టేషన్ల వద్ద తిరిగే దళారుల సహకారం తీసుకోవాలి. నిందితులు కూడా నాయకులు, దళారుల సహకారం తీసుకొని ఠాణాలకు వస్తున్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు దళారుల మాయలో పడుతూ కేసులు నమోదు చేయకుండా.. సెటిల్‌మెంట్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

### ఇదో ప్రత్యక్ష ఉదాహరణ..

సౌత్‌జోన్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌కు ఓ మహిళ శనివారం ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. మేకల వ్యాపారంలో పెట్టుబడి పెడుతామంటూ డబ్బులు తీసుకొని కొన్నాళ్లు ఇచ్చి, ఆ తరువాత మోసం చేశారంటూ ఆమె ఫిర్యాదు చేసేందుకు ఠాణాకు వెళ్లింది. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు మేం పిలిపించి మాట్లాడుతామంటూ ఆమెను పంపించేశారు. మరుసటి రోజు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫరీసా పైరవీకారులతో కలిసి స్టేషన్‌కు వెళ్లింది. ఆదివారం స్టేషన్‌కు వెళ్లి మాట్లాడుకొని వెళ్లిపోయారు. సోమవారం మరోసారి బాధితురాలు స్టేషన్‌కు వెళ్లింది.. అప్పుడు తిరిగి ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ దళారులతో కలిసి వెళ్లి స్టేషన్‌లో ఉన్న ఎస్సైతో మాట్లాడింది. ఈ సందర్భంగా బాధితురాలు నిలబడి మాట్లాడుతుండగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ కూర్చొని సమాధానాలు చెబుతుంది. అయితే ఇక్కడ కనీసం ఇద్దరినీ కూర్చొబెట్టి మాట్లాడాల్సిన పోలీసులు దళారులతో చేతులు కలపడంతో బాధితురాలినే నిందితురాలిగా ట్రీట్ చేయడం వివాదాస్పదమయ్యింది.

### సిటీ పోలీస్‌పై అవగాహన లేకున్నా..



నగర కమిషనరేట్‌లో పనిచేస్తున్న చాలా మంది సిబ్బంది ఎన్నికల సందర్భంగా బదిలీలపై వచ్చిన వాళ్లున్నారు. అందులో కొందరికి సిటీ పోలీసింగ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోడవం సహజమే. దళారులు కొందరు రాజకీయ నాయకులకు సంబంధించిన వాళ్లు ఉంటున్నారు. ఎవరికి ఏ రాజకీయ నాయకుడితో సంబంధాలున్నాయో అనే బావనతో వచ్చిన వారందరికీ ఇలా మర్యాద ఇస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు మనమున్నామనే భరోసాను మర్చిపోవడం ఆందోళన కల్గిస్తుందని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్టేషన్లలోని సిబ్బందికి అవగాహన కల్పించాలి వారి ప్రవర్తన మార్చాల్సిన అవసరముందని నగర వాసులు కోరుతున్నారు.

# నాడు కేసీఆర్ ఆదేశించారు నేడు కాంగ్రెస్ పాటించింది



- మీరాలం చెరువుపై హై లెవల్ బ్రిడ్జి
- నాలుగు వరుసల్లో.. రూ.363 కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదనలు
- చెరువు మీదుగా 2.65 కి.మీ మేర నిర్మాణం
- బెంగళూరు జాతీయ రహదారితో చింతల్‌మెట్ రోడ్డుతో అనుసంధానం
- ఎన్నికల కోడ్ రాకముందే శంకుస్థాపనకు ఏర్పాట్లు

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ) : పాతనగరంలో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జూపార్కును అనుకొని ఉన్న మీరాలం చెరువు మీదుగా 2.5 కి.మీ మేర నిర్మించే హైలెవల్ బ్రిడ్జి బెంగళూరు జాతీయ రహదారి నుంచి అత్తాపూర్ వైపు చింతల్‌కుంట రోడ్డుకు అనుసంధానం చేసేలా నిర్మాణం చేపట్టనున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మీరాలం ట్యాంక్ మీదుగా ఈ హై లెవల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉంచగా, దానికి కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సుమారు రూ.363 కోట్లతో మీరాలం చెరువు హై లెవల్ బ్రిడ్జిని నాలుగు వరుసల్లో నిర్మించనున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పరిపాలన అనుమతులను జారీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ జీవో ఆర్‌టీ నం.120 సోమవారం జారీ చేసింది. పార్లమెంటు ఎన్నికల కోడ్ రాకముందే శంకుస్థాపన పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

### కేటీఆర్ చొరవతో హై లెవల్ బ్రిడ్జి

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ హైదరాబాద్ మహానగరంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరం నలుమూలలా విస్తరిస్తున్నా పాతనగరంలో మాత్రం మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వాలు ప్రాధాన్యతనివ్వలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పాతనగరంలోని బహదూర్‌పురలో ఇప్పటికే ఒక ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించి ప్రారంభించగా, మరో ఫ్లై ఓవర్ జూపార్కు నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు నిర్మాణంలో ఉంది. ఇదే ప్రాంతంలో ఉన్న మీరాలం చెరువు మీదుగా మెహిదీపట్నం, అత్తాపూర్ వైపు ఉన్న ఇన్నర్ రింగు రోడ్డుతో అనుసంధానం అయ్యేలా మీరాలం ట్యాంక్ మీదుగా అత్యాధునిక శైలిలో, నగరానికి మరింత వన్నె తెచ్చేలా హై లెవల్ బ్రిడ్జిని నిర్మించాలని సూచించడంతో హెచ్‌ఎండీఏ అధికారులు రెండు రకాల ప్రతిపాదనలను రూపొందించారు. హైటెక్ సిటీలోని దుర్గం చెరువు మీదుగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జి తరహాలో నిర్మించాలని ప్రతిపాదిస్తే రూ.700 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. దానికి బదులుగా సాధారణంగా ఉండే బ్రిడ్జిని నిర్మించాలని మరో ప్రతిపాదనను సిద్ధం చేయగా, దానికి రూ.360 కోట్ల వరకు అవుతుందని అంచనా వేశారు. నగరంలో భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో పేరుగాంచిన హెచ్‌ఎండీఏ దీన్ని నిర్మించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేసింది.

# నేను సీబీఐ..! ఐతే ఏంది.?



### స్కైప్‌లో బెదిరించిన సైబర్ చీటర్స్

రూ.15 లక్షలకు టోకరా వేసేందుకు యత్నం

అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చిన 70 ఏండ్ల వృద్ధుడు

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ): 70 ఏళ్ల వృద్ధుడికి తాము ముంబాయి పోలీసులమంటూ ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఫెడెక్స్ కొరియర్ పార్శిల్‌లో 5 పాస్‌పోర్టులు, 3 క్రెడిట్‌కార్డులు, 200 గ్రాముల ఎండీఎంఏ, ఒక ల్యాప్‌టాప్ ఉంది మీ ఆధార్‌కార్డు నంబర్‌ను ముంబాయి కస్టమ్స్‌లో సీజ్ చేశారంటూ మాట్లాడారు. బాధితుడికి ఏమి అర్థం కాలేదు.. మీతో వీడియో కాల్ మాట్లాడాలి స్కైప్ ఉందా అని అడిగారు.. ఆయన స్కైప్ కనెక్ట్ కావడంతోనే పోలీస్ డ్రెస్‌లో మెడలో ఐడీ కార్డు వేసుకొని సీబీఐ అధికారిలా మాట్లాడుతున్నారు. మీ ఆధార్‌కార్డుపై ఐదు బ్యాంకు ఖాతాలు తెరిచారు. మనీ లాండరింగ్ జరిగింది. దీనిని లోతుగా దర్యాప్తు జరుపాలి అందుకు రూ.15,38,312 డిపాజిట్ చేయాలి. ఆ డబ్బులు తిరిగి మీకు రిటర్న్ వస్తాయంటూ నమ్మించారు. వాళ్లు చెప్పే మాటలపై అనుమానం వచ్చిన బాధితుడు వాళ్ల మాటలకు లొంగకుండా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇలా డిజిటల్ లాక్ నుంచి తప్పించుకొని సైబర్ నేరగాళ్లకు గట్టిగా బుద్ధి చెప్పాడు. ఇలా 70 ఏళ్ల వృద్ధుడిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఇలాంటి కాల్స్‌ను అనుమానిస్తూ, సైబర్ నేరగాళ్లను కట్టడి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు సహకరించాలని సైబర్‌క్రైమ్ పోలీసులు కోరుతున్నారు.

# సాగర్ అలలపై.. లేజర్ అందాలు

### రూ.50 కోట్లతో సంజీవయ్య పార్కులో ఏర్పాటు

బేగంపేట్, మార్చి 12 : భారతదేశంలోని అత్యుత్తమ పర్యాటక ప్రాంతాల్లో హైదరాబాద్ ఒకటని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర పర్యాటక శాఖ సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీంలో భాగంగా రూ.50 కోట్లతో నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో ఏర్పాటు చేసిన సౌండ్ లేజర్ షోను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ నుంచి మొదలైన కోహినూర్ వజ్రం కథను ఈ లేజర్ షోలో వివరించారు. ఈ కథను రాజ్యసభ ఎంపీ, సినీ రచయిన రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కథకు ప్లేబ్యాక్ సింగర్‌గా గాయనీ సునీత, సంగీతాన్ని ప్రముఖ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్ అందించారని చెప్పారు. ఈ షోను తిలకించేందుకు సుమారు వెయ్యిమంది పర్యాటకులు కూర్చునే విధంగా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.



ట్యాంకుబండ్‌పై లేజర్ షోలో అమ్మవారు

# మూసీ నాలాలో బాలుడు..

**కాపాడిన స్థానికులు**



బాలుడు జోహెబ్ హందాన్‌ను అతడి తాతకు అప్పగిస్తున్న పోలీసులు

చాదర్‌ఘాట్, మార్చి 12 : మూసీ నాలాలో అనుమానాస్పద స్థితిలో ఉన్న ఓ బాలుడిని స్థానికులు బయటకు తీసుకొచ్చి చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆజంపురా ప్రాంతానికి చెందిన జోహెబ్ హందాన్(8) మంగళవారం చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసానగర్ వద్ద మూసీ కాలువలో స్థానికులకు కనిపించాడు. వెంటనే స్థానికులు బాలుడిని బయటకు తీసుకొచ్చి స్నానం చేయించి చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. అదే సమయంలో జోహెబ్ ఆచూకీ కోసం ఫిర్యాదు చేసేందుకు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాలుడి తాత ఎం.ఏ.జబ్బార్‌కు బాలుడిని అప్పగించారు. సరైన సమయంలో స్థానికులు సమయస్ఫూర్తితో వ్యవహరించి జోహెబ్‌ను మూసీ నది ప్రవాహంలో కొట్టుకుపోకుండా కాపాడిన స్థానికులకు పలువురు అభినందించారు.